# తాతా బామ్మల పెళ్లి కథ

"సూర్యాన్నీ సుందరినీ చూస్తే - దేవుడు చేసే విడ్డూరాల్లో ఇదీ ఒకటి అనిపిస్తుంది.

అసలు వాళ్లిద్దరికీ పెళ్లి సంబంధం ఎలా కుదిర్చారో వాళ్ళ పెద్దలూ... పెళ్లి పెద్దలూ... అనిపిస్తుంది.

ఒక్కోసారి చిరాకేస్తుంది. కొన్నిసార్లు చిరునవ్వొస్తుంది.

గంతకు తగ్గ బొంత అన్నట్లు పెళ్ళిళ్లయిపోతుంటాయి. మనం మన అహంకారం కొద్దీ పెళ్ళికూతుర్ని మనమే నిర్ణయించుకున్నామనీ, పెళ్లికొడుకు నా అందానికి ఢమాలైపోయి తాళికట్టేశాడనీ అనుకుంటాం గానీ...

'హ.. ది.. హె... ప్పు.. థో.. దే.. హు.. థు.. రా.. సి.. న.. రా... త...' అనే మాట దేవుడి మీద కోపం వచ్చినప్పుడుగానీ అనుకోలేం"

కథ వింటున్న సరస్వతి మొగుడుకేసి కోపంగా చూసింది.

"కథ కన్నా.. ఉపోద్ఘాతానికి ఎక్కువ టైమ్‌వేస్టు చేస్తున్నానని ఎర్రగా చూడకు సరస్వతీ - నేను ఇప్పుడు చెప్పబోయే సూర్యం - సుందరిల జంట తాలూకు కథకి ఈపాటి ముందు మాట అవసరం"

సరస్వతి మౌనం.

"నిజం"

సరస్వతి ఫేను స్పీడు పెంచి వచ్చి కూచుంది.

"పోనీ.. కథలోకొచ్చేస్తాను. దేవుడు చేసే కామెడీ షోలో మన సూర్యం

సుందిరి... హీరో హీరోయిన్లు.. మన వెంకటగిరిలో... మన చుట్టాల్లోనే సూర్యం తాత కుటుంబానికి నలభై మగ్గాల పని ఉండేది. తరతరాలుగా కుటుంబాన్నీ మగ్గాల్నీ , గౌరవాలన్నీ సంపాదించుకుంటున్న ఆ పెద్ద కుటుంబంలో చిన్న చిగురు సూర్యం తాత. తాత చిన్నతనంలో మేనత్త కూతురు సుందరినిచ్చి పెళ్ళి చేశారు. పెళ్లయ్యేటప్పటికి సుందరికి పట్టుచీర కట్టుకోవచ్చు, పల్లకీ ఎక్కచ్చు అన్న సరదా తప్ప... సూర్యం బావ తన మొగుడవుతాడని తెలియదు. మొగుడంటే ఏంటో కూడా నిజానికి సుందరికి తెలీదు. 'ఒరే నువ్ పెళ్లి చేసుకోవాల్రా' అన్నాడు సూర్యం తండ్రి.

"పెళ్లంటే ఏంటి నాన్నా" అడిగాడు సూర్యం.

జవాబు చెప్పడం తెలియలేదు తండ్రికి.

"పెళ్లంటే.. ఏంటి అంటావేట్రా.. వెర్రి నాగన్నా!" అంటూ అర్థం అవని మాటల్లో కొంత ఉత్సాహాన్ని రేకెత్తించాడు.

అది పడుగు పేర్చిందనుకో నువ్వు పేక అల్లడం – రెండు కలిస్తే కలనేత రంగుల చీర.

మరి ఇన్నాళ్లుగా కండీలు – చుట్టటమే తప్ప చీర నేయడం నేర్పని తండ్రి.. ఆ టెక్నిక్ నేర్పుతాడనుకుని పెళ్ళికి తలూపాడు.

పెళ్లయింది.

సుందరి పద్దెనిమిదేళ్లకు వస్తోంది.

సూర్యానికి పంతొమ్మిదేళ్లు దాటాయి.

ఒకళ్లంటే ఒకళ్లకి అనురాగం ఏర్పడలేదు. ఎందుకో.. ఏవిటో? పెద్దలెవరికీ తెలీదు.

అయినా వాళ్లు బ్రహ్మ.. కుదిర్చిన మొగుడూ పెళ్లాలు.

భర్తను దగ్గరకి రానీలేదు భార్య.

భార్యని అక్కున చేర్చుకోలేదు భర్త.

✦ ✦ ✦

సూర్యానికి ఆధిపత్యం చేజిక్కేటప్పటికీ మగ్గాల సంఖ్య తగ్గింది. రెండు మగ్గాలకు చేరుకుంది.

రెండింటి మీదా పడుగు పేకలేస్తూ బతికేస్తున్నారు.

అప్పుడే ఈ దంపతులకి బెనారస్ హేండ్లూమ్ ఎగ్జిబిషన్‌కి వెల్లి తమ సత్తా నిరూపించుకోవాలనిపించింది.

రకరకాల డిజైన్లతో చీరలు నేసి 'మేము నేత పనికి అంకితమైన వాళ్లమే' అని తమ ప్రతిభను చూపిద్దామని నిర్ణయించేసుకున్నారు.

భార్యాభర్తలిద్దరూ ఒక మాట మీద మొదటిసారి నిలబడిన ఈ యాత్ర ఆ రెండు జీవితాల్ని మలుపుతిప్పింది.

ఊరు కాని ఊరు, భాషకాని భాష, మనవాళ్లు కాని జనం.

రకరకాల రంగుల కలనేతల చీరలు. భార్యాభర్తలిద్దరూ తమ మాటలు విప్పేముందు ఎదుటివాళ్లు నేసిన చీరలు చూడాలనుకున్నారు.

ఎగ్జిబిషనంతా తిరిగారు. అప్పుడే దారి తప్పారు. ఆయన కోసం ఆవిడ– గతి తప్పి మతి తప్పి తిరిగారు.

ఎవర్ని అడగాలన్నా భాష తెలీదు.

ఇద్దరూ కళ్లింత చేసుకుని, కళ్లల్లో అంత నీరు పొంగించుకుని మూగవాళ్ళల్లా మారిపోయినట్లు సైగలతో సుందరి సూర్యం గురించి, సూర్యం సుందరి గురించి ఆచూకీ చేస్తూ తిరుగుతూంటే చూసే వాళ్లకి ఆమె ఒక పిచ్చిదనీ... ఏదో భాష మాట్లాడుతోందనీ అనిపించింది.

అతని పరిస్థితి కూడా అదే.

"నా భార్య ఎర్ర చీర- మూటనిండా బట్టలండీ... మీరెక్కడైనా చూశారూ?" అని అంటోన్న భాష సైగ- అర్థం కాని జనం అతన్నొక పిచ్చాళ్లాగే చూశారు.

మూడు గంటల ఈ పరస్పర అన్వేషణ వాళ్లిద్దర్నీ కలగలిపింది.

ఎట్టకేలకు భార్యను చూశాడు.

బావురుమంటూ పరిగెత్తుకుంటూ వచ్చి కౌగిలిలో బంధించాడు.

ఆమె అతని కౌగిలిలో బిగిసిపోతూ 'బేర్'మంటూ ఏడ్చింది.

ఇది వారి వాళ్ల జీవితంలో మొదటి కౌగిలింత అంటే నువ్వు నమ్ముతావా సరస్వతీ భర్త కన్నీళ్లు ఆవిడకప్పుడు తలంబ్రాలయ్యాయి.

భార్య కన్నీళ్లు అతని హృదయానికి అభిషేకాలయ్యాయి. ఆ తర్వాత వెంకటగిరికొచ్చాక రెండు మగ్గాలు మూడు మగ్గాలయ్యాయి"

"ఇంత కవిత్వం ఎందుకండీ. వాళ్లకి పిల్లోపిల్లాడో పుట్టారని చెప్పచ్చు కదా" అంది సరస్వతి.

"సరస్వతీ ఆయన మా తాతగారని ఆవిడ మా బామ్మగారని నీకు ఎలా చెప్పాలో తెలీట్లేదు"

"అంటే..?"

"సూర్యంగారు మా తాతయ్యగారా?"

"కాదు సరస్వతీ. మా తాతయ్యగారు"

"కాదు మహాప్రభో మన తాతయ్యగారు"

మేనత్త మేనమామలైన పిల్లలైన ఈ ఇద్దరూ మనసారా నవ్వుకున్నారు.

తాతా బామ్మల పెళ్ళి కథకి-